సాక్షి
కాకినాడ

సోమవారం । 27 । ఫిబ్రవరి । 2023



నిత్యాన్నదానానికి విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని సన్నిధిలో నిత్యాన్నదానానికి వి.అలివేలు మంగతాయారు, కుటుంబ సభ్యులు (శివకోడు) ఆదివారం రూ.50,001 విరాళం సమర్పించారు.



సుదర్శన హోమానికి విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీ నృసింహుని ఆలయంలో నారసింహ సుదర్శన హోమానికి కె.ఆదర్శ, శ్రీలక్ష్మి దంపతులు (హైదరాబాద్) ఆదివారం రూ.1,01,116 విరాళం సమర్పించారు.

అమ్మా... బై బై





కన్నా.. పరీక్ష బాగా రాయ్.. తొందర పడకుండా జాగ్రత్తగా వెళ్లి రా నాన్నా.. అంటూ తల్లి సాగనంపగా...! అలాగే అమ్మా బై వెళ్లి వస్తా... అంటూ ఇంటి నుంచి పరీక్ష రాసేందుకు బయలుదేరిన ఇద్దరు విద్యార్థులు కొద్ది నిమిషాల్లోనే అనుకోని ప్రమాదంలో అనంత లోకాలకు వెళ్లిపోయారు. - 8లో▸

న్యూస్‌రీల్

ట్రాన్స్‌జెండర్‌పై హత్యాయత్నం

కాకినాడ క్రైం: గంజాయి తాగిన ఓ వ్యక్తి ట్రాన్స్‌జెండర్‌పై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ కామేశ్వరీ నగర్‌కు చెందిన మున్నా శుక్రవారం అర్ధరాత్రి గంజాయి తాగి అదే ప్రాంతంలో రోడ్డు పక్కన నిలిపి ఉంచిన ఆటోలో కూర్చున్నాడు. ఆ సమయంలో తన ద్విచక్ర వాహనంపై వెళుతున్న మౌనిక అనే ట్రాన్స్‌జెండర్‌ను ముందుకు వెళ్లకుండా అడ్డంగా నిలుచున్నాడు. బండి దిగి ఆటో ఎక్కాలంటూ గొడవ చేశాడు. అందుకు మౌనిక అంగీకరించలేదు. దీంతో ఆగ్రహంతో ఊగిపోయిన మున్నా తన వెంట తెచ్చుకున్న చాకుతో మౌనిక మెడ, చేతుల భాగాల్లో నరికాడు. ఇది గమనించిన చుట్టుపక్కల ప్రజలు ఆమెను కాకినాడ జీజీహెచ్‌లో చేర్చారు. బాధితురాలి ఫిర్యాదుతో నిందితుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. విచారణకు హాజరవుతున్న క్రమంలో నిందితుడు మున్నా గోరుతో గాయాలు చేసుకున్నాడు. హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం నిందితుడిని కోర్టులో హాజరుపర్చనున్నారు.

హెలిప్యాడ్ స్థలం పరిశీలన



హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించి పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి

నిడదవోలు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్చి 1వ తేదీన నిడదవోలులో పర్యటిస్తున్న నేపథ్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు కుమార్తె డాక్టర్ సౌమ్యశ్రీ వివాహ రిసెప్షన్‌కు సీఎం వైఎస్ జగన్ హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో పట్టణ శివారులోని సుబ్బరాజుపేట వద్ద ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ స్థలాన్ని ఎస్పీ ఆదివారం పరిశీలించారు. సీఐ కె.వెంకటేశ్వరరావు, ఎస్సైలు పి.నాగరాజు, షేక్ సుభానీ పాల్గొన్నారు.

కాపు కల్యాణ మండపానికి విరాళం



కాపు సంఘం నేత ప్రభాకరరావుకు విరాళాన్ని అందజేస్తున్న దాతలు

ఆలమూరు: స్థానిక భువనేశ్వరి చెరువు సమీపంలో శ్రీకృష్ణదేవరాయ కాపు అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ సహకారంతో కల్యాణ మండపాన్ని నిర్మిస్తున్నారు. దీనికి పెదపళ్లకు చెందిన విశ్రాంత పంచాయతీ కార్యదర్శి నిమ్మకాయల పట్టాభిరామయ్య జ్ఞాపకార్థం భార్య ఆదిలక్ష్మి, కుమారులు సాయిరామ్, బ్రహ్మాజీలు రూ.50 వేల విరాళం సమర్పించారు. ఈ మొత్తాన్ని సంఘం అధ్యక్షుడు చల్లా ప్రభాకరరావుకు అందజేశారు. దాతలను కాపు సంఘ నాయకులు రామానుజుల శేషగిరిరావు, చల్లా నానాజీ, శిరిగినీడి పట్టాభి, ఎలుగుబంట్ల సాయి తదితరులు అభినందించారు. నిమ్మకాయల ప్రశాంత్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆచార్యా.. ఆచరించరా!

- డైరెక్టర్లయితే పాఠాలు చెప్పరా?
- జేఎన్‌టీయూకేలో వింతపోకడ
- విద్యార్థుల ఆవేదన
- బోధన తప్పనిసరి అంటున్న ఉన్నత విద్యా శాఖ
- పట్టించుకోని డైరెక్టర్లు



కాకినాడ జేఎన్‌టీయూ

సాక్షి ప్రతినిధి, కాకినాడ: స్వాతంత్ర్యానికి పూర్వం ఆవిర్భవించి, దేశానికే తలమానికంగా నిలిచిన కాకినాడ జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం(జేఎన్‌టీయూ)లో ఆచార్యులకు పాఠాలు చెప్పే తీరిక చిక్కడం లేదు. ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో కాకినాడలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రారంభమైంది. దేశం నలు చెరగులా అఖండ కీర్తిని సొంతం చేసుకుంది. ఉమ్మడి మద్రాస్ నుంచి విడివడి ఆంధ్ర రాష్ట్రం ఏర్పడ్డాక 1972లో హైదరాబాద్ కేంద్రంగా ఉన్న జేఎన్‌టీయూ–హెచ్‌కు కాకినాడ, అనంతపురం, హైదరాబాద్ కాలేజీలు అనుబంధంగా ఉండేవి. తదనంతర కాలంలో స్థానికుల విజ్ఞప్తుల మేరకు 2008 ఆగస్టు 20న కాకినాడ కేంద్రంగా జేఎన్‌టీయూ–కేను ప్రత్యేక యూనివర్సిటీగా నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఏర్పాటు చేశారు. దీనికి 162 ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు, నరసరావుపేట ప్రభుత్వ కళాశాల అనుబంధంగా ఉన్నాయి. ఈ వర్సిటీ విభిన్న రంగాలకు ఎంతోమంది మేధావులను అందించింది.

ఇంతటి ఖ్యాతిని సొంతం చేసుకున్న ఈ వర్సిటీలో విశేష అనుభవం కలిగిన ప్రొఫెసర్లకు (ఆచార్యులు) లోటు లేదు. కానీ చాలామంది అరకొర పాఠాలతోనే సరిపెడుతున్నారు. ఫలితంగా.. సుదూర ప్రాంతాల నుంచి రెక్కలు కట్టుకు వస్తున్న విద్యార్థి లోకం ఆశించిన మేధాసంపత్తి పొందకుండానే వర్సిటీ నుంచి నిష్క్రమించాల్సి వస్తోంది. ఏపీ ఈఏపీ సెట్‌లో 10 వేల లోపు, జనరల్ కేటగిరీలో 2 వేల లోపు ర్యాంకులు సాధిస్తేనే జేఎన్‌టీయూకేలో చదివే అవకాశం దక్కుతుంది. అంత కష్టపడి ర్యాంకులు సాధించి వర్సిటీకి వస్తే.. ఇక్కడ కొందరు ఆచార్యులు పాఠాలు చెప్పడం లేదని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు.

డైరెక్టర్లమనే సాకుతో..

పరిపాలన సౌలభ్యం కోసం వర్సిటీలో ప్రొఫెసర్ స్థాయి ఉన్న వారిని సహజంగానే వివిధ విభాగాల్లో డైరెక్టర్లుగా నియమిస్తారు. ఈవిధంగా జేఎన్‌టీయూకేలో 24 మందిని డైరెక్టర్లుగా నియమించారు. వర్సిటీలోని ప్రతి విభాగంలోనూ ముగ్గురు నుంచి ఐదుగురు ఆచార్యులు డైరెక్టర్లుగా ఉన్నారు. వీరు పరిపాలనా అంశాలపై ఒకటి రెండు గంటల సమయం కేటాయిస్తే సరిపోతుంది. మిగిలిన సమయం అంతా ఖాళీనే. డైరెక్టర్లుగా ఉన్న ఆచార్యులు సైతం విద్యార్థులకు విధిగా పాఠాలు కూడా చెప్పాలి. ఎవరెన్ని గంటలు పాఠాలు చెప్పాలనేది ఉన్నత విద్యా శాఖ మార్గదర్శకాల్లో నిర్దేశించింది. కానీ డైరెక్టర్లమనే సాకుతో కొంతమంది పాఠాలు చెప్పకుండా కాలయాపన చేస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరితో పాటు కొంత మంది ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు కూడా విధులకు డుమ్మా కొట్టి సొంత పనులు చక్కబెట్టుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. కొందరైతే కాంట్రాక్ట్ అధ్యాపకుల పైనే భారం నెట్టేస్తున్నారు.

నిబంధనలున్నా..

వర్సిటీలో బీటెక్ 7 బ్రాంచిలు, ఎంటెక్ 16 బ్రాంచిలు, ఎనిమిది రకాల సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు ఉన్నాయి. అన్ని విభాగాలూ కలిపి 2 వేల మంది చదువుతున్నారు. రెగ్యులర్‌లో ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థాయిలో 73 మంది పని చేస్తున్నారు. కాంట్రాక్ట్ విభాగంలో మరో 80 మంది ఉన్నారు. ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్లు వారానికి 14 తరగతులు, అసిస్టెంట్లు 16, కాంట్రాక్ట్ ప్రొఫెసర్లు 16 తరగతులు బోధించాలి. ఈ విషయం ఉన్నత విద్యా శాఖ నిబంధనల్లో స్పష్టంగా ఉంది.

జేఎన్‌టీయూ విద్యార్థులు విభిన్న రంగాల్లో నిష్ణాతులుగా పేరు తెచ్చుకున్నారు. బెల్ సీఎండీ శాస్త్రి, శాంతా బయోటెక్ అధినేత పద్మవిభూషణ్ వరప్రసాద్‌రెడ్డి, మెట్రో సీఎండీ పద్మవిభూషణ్ శ్రీధర్, ఉన్నత విద్య ముఖ్య కార్యదర్శి శ్యామలరావు, ఐఏఎస్‌లు కృష్ణబాబు, ముద్దాడ రవిచంద్ర, మాజీ ఐఏఎస్ ఎస్‌పీ ప్రసాద్, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రముఖ స్థానాల్లో ఉన్న వారు, ప్రజాప్రతినిధులు కూడా ఇక్కడ చదువుకున్న వారే కావడం విశేషం. ఇంత మంది ప్రముఖులకు విద్యాబుద్ధులు నేర్పించిన ఈ వర్సిటీలో ప్రస్తుత ఆచార్యులు కూడా తమ నైపుణ్యాన్ని విద్యార్థులకు అందించి, వర్సిటీ ప్రతిష్టను ఇనుమడింపజేయాలని పలువురు కోరుతున్నారు.

స్వయంగా వీసీయే బోధిస్తున్నా..

వర్సిటీలోని ఆచార్యులందరూ ఆయా విభాగాల్లో అపార అనుభవం ఉన్న వారే. అటువంటి వారి వద్ద చదివితే తమ భవిత బాగుంటుందనే ఉద్దేశంతో వస్తే.. ఆచార్యులు సరిగ్గా బోధన చేయడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక ప్రొఫెసర్‌కు ప్రభుత్వం రూ.2 లక్షలకు పైగా వేతనం, వైవా (పీహెచ్‌డీ, ఎంబీఏ వంటి వాటికి మౌఖిక పరీక్ష) నిర్వహణ, కమిటీ సమావేశాల్లో పాల్గొన్నందుకు అలవెన్సులు కూడా చెల్లిస్తుంది. స్వయానా వర్సిటీ వైస్ చాన్సలర్ జీవీఆర్ ప్రసాదరాజు సైతం రోజూ ఉదయం 9 నుంచి 10 గంటల వరకూ విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారు. వాస్తవానికి విద్యార్థులకు పాఠాలు చెప్పడంలో వీసీకి మినహాయింపు ఉంది. అయినప్పటికీ పాలనాపరంగా ఎంత ఒత్తిడి ఉన్నా, మినహాయింపు ఉన్నా సొంత విభాగం సివిల్‌లో ఆయన ఒక క్లాస్ తీసుకుంటున్నారు. కానీ కొందరు డైరెక్టర్లు మాత్రం అసలు పాఠాలు చెప్పకుండా డుమ్మా కొడుతున్నారని విద్యార్థులు అంటున్నారు.

ఎవ్వరికీ మినహాయింపు లేదు



వర్సిటీలో విద్యార్థులకు పాఠాలు చెప్పకుండా ఎవ్వరికీ మినహాయింపులు లేవు. ఈ విషయాన్ని ఉన్నత విద్యా శాఖ స్పష్టంగా పేర్కొంది. డైరెక్టర్లు పాలనా సౌలభ్యం కోసం నియమితులైన వారే. వర్సిటీ పేరు ప్రఖ్యాతుల దృష్ట్యా ప్రతి ప్రొఫెసర్ విధిగా పాఠాలు చెప్పాల్సిందే. బోధనపై ప్రతి నెలా రెండు పర్యాయాలు అన్ని డిపార్టుమెంట్లనూ పరిశీలిస్తున్నాను. లోపాలుంటే సరిదిద్దుకునేందుకు అవకాశం ఇస్తున్నాం. ఈ మేరకు ఆయా విభాగాలకు ఆదేశాలు కూడా జారీ చేశాం.

- డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు,
వైస్ చాన్సలర్, జేఎన్‌టీయూ-కాకినాడ

తలుపులమ్మ సన్నిధికి భక్తజన ప్రవాహం



లోవ ప్రాంగణంలో చెట్ల కింద వంటలు, భోజనాలు చేస్తున్న భక్తులు

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారిని దర్శించేందుకు వచ్చిన భక్తజనంతో లోవ దేవస్థానం కిక్కిరిసింది. వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆదివారం లోవకు తరలివచ్చారు. 12 వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్టు కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయంతో రూ.1,50,960, పూజా టికెట్లకు రూ.1,40,250, తలనీలాలకు రూ.11,550, వాహన పూజలకు రూ.9,610, కాటేజీ, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెలుగా రూ.64,800, విరాళాలుగా రూ.1,70,130 కలిపి మొత్తం రూ.4,84,300 ఆదాయం సమకూరిందని వివరించారు. వసతి గదులు లభించని భక్తులు దేవస్థానం ప్రాంగణంలో చెట్ల కింద, కొండ దిగువన మామిడి తోటల్లోను వంటలు చేసుకుని భోజనాలు ముగించారు.

కోటసత్తెమ్మ వారికి రూ.1.55 లక్షల ఆదాయం

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారిని ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ప్రధానార్చకుడు అప్పారావుశర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోల అమ్మకం ద్వారా దేవస్థానానికి రూ.1,55,446 ఆదాయం వచ్చిందని ఈఓ బళ్ల నీలకంఠం (శివ) తెలిపారు.

నేడు యథావిధిగా స్పందన

కాకినాడ సిటీ: జిల్లా స్థాయి స్పందన కార్యక్రమాన్ని కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం యథావిధిగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ కృతికా శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు, జిల్లా అధికారులు ఈ విషయం గమనించాలని సూచించారు.

వెంకన్న ఆలయ అభివృద్ధికి రూ.3 లక్షల విరాళం



దాతలకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ చైర్‌పర్సన్ విరీతాదేవి తదితరులు

అమలాపురం టౌన్: అమలాపురంలో వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులకు పట్టణ గోఖిలే వీధికి చెందిన దివంగత అక్షింతల రామమూర్తి, అచ్యుతం దంపతుల జ్ఞాపకార్థం వారి కుమార్తెలు, కుమారులు రూ.3 లక్షల విరాళాన్ని సమర్పించారు. ఆదివారం ఆలయంలో ఈ మొత్తాన్ని ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవికి అందజేశారు. అనంతరం దాతలైన అక్షింతల కుటుంబ సభ్యులకు విరీతాదేవి, ఈఓ దూనబోయిన సాయిబాబు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. దాతలు ఇచ్చిన రూ.3 లక్షలను ఆలయంలో శాలాహారం నిర్మాణానికి వినియోగిస్తామని చైర్‌పర్సన్ వివరించారు. ఆలయ అభివృద్ధి ప్రోత్సాహకకర్త యెండూరి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ యువజన కమిటీ అధ్యక్షుడు దూడల ఫణి, ఆలయ ధర్మకర్తలు నడింపల్లి వర్మ, సంసాని అబ్బు, యెండూరి రాఘవ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా...

- చురుకుగా శివసదన్ నిర్మాణం
- సత్యగిరిపై రూ.16 కోట్లతో పనులు
- ఏప్రిల్ నాటికి అందుబాటులోకి..
- సత్యదేవుని సన్నిధిలో తీరనున్న వసతి సమస్య

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో రూ.16 కోట్లతో నిర్మిస్తున్న 138 గదుల శివసదన్ సత్రం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వచ్చే ఏప్రిల్ 30 నుంచి జరగనున్న సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాల సందర్భంగా ఈ సత్రాన్ని ప్రారంభించి, భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు. శివసదన్ సత్రంలో అన్నీ ఏసీ గదులే కావడంతో దేవస్థానానికి ఆదాయం కూడా భారీగా వచ్చే అవకాశం ఉంది. రోజుకు కనీసం రూ.లక్ష పైగా వస్తుందని భావిస్తున్నారు.

ఏటా 33 శాతం పెరుగుతున్న భక్తులు

సత్యదేవుడు కొలువైన రత్నగిరికి ఏటా 33 శాతం చొప్పున భక్తుల సంఖ్య పెరుగుతోంది. దీంతో వారికి వసతి కల్పించడం సమస్యగా మారింది. స్వామివారి సన్నిధికి సాధారణ రోజుల్లో 10 వేల నుంచి 20 వేల మంది వరకూ భక్తులు వస్తున్నారు. కార్తిక మాసం, పర్వదినాల్లో ఆ సంఖ్య లక్షకు మించి ఉంటోంది. ఇంత భారీ సంఖ్యలో భక్తులు వస్తున్న అన్నవరం దేవస్థానంలోని వివిధ సత్రాల్లో 538 గదులు మాత్రమే ఉన్నాయి. కనీసం వెయ్యి గదులుంటే తప్ప భక్తుల అవసరాలు తీరవు. ఈ పరిస్థితుల్లో శివసదన్ సత్రం నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని దేవస్థానం అధికారులు నిర్ణయించారు.

ఇదీ శివసదన్ సత్రం స్వరూపం

విస్తీర్ణం :	ఎకరం
సత్రం నిర్మాణ స్థలం :	70 సెంట్లు
అంతస్తులు :	5
బ్లాకులు :	4
గదులు :	138
సాధారణ గదులు :	118 (18 ఘ 12 అడుగులు)
సూట్ రూములు :	20 (22 ఘ 20 అడుగులు)
మెట్లు :	నాలుగుచోట్ల
లిఫ్టులు :	2
పోర్టికో :	తూర్పు వైపు
పార్కింగ్ స్థలం :	భవనం చుట్టూ

శ్లాబ్, బ్రిక్‌వర్క్ పనులు పూర్తి

వాస్తవానికి 2018లోనే సత్రం నిర్మాణం ప్రారంభమైంది. నిర్మాణ స్థలంలో పెద్దపెద్ద బండరాళ్లుండటంతో వాటి బ్లాస్టింగ్, తొలగింపు పనుల కారణంగా ఏడాది జాప్యం జరిగింది. ఈలోగా 2020, 2021 సంవత్సరాల్లో కరోనా వ్యాప్తి కారణంగా నిర్మాణ పనులు నిలిచిపోయాయి. తర్వాత పనులు మొదలైనా వివిధ కారణాలతో పనులు నత్తనడకన సాగాయి. కాంట్రాక్ట్ ప్రకారం గత ఏడాది ఏప్రిల్‌కు సత్రం నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. పనులు పూర్తి కాకపోవడంతో గడువును వచ్చే మార్చి 31 వరకూ పొడిగించారు. ప్రస్తుతం ఈ సత్రం పనులు వేగంగా జరుగుతున్నాయి. నాలుగు వైపులా ఐదంతస్తుల శ్లాబ్‌ల నిర్మాణం, బ్రిక్ వర్క్ పూర్తయ్యాయి. ఎలివేషన్, గదుల్లో టైల్స్ అతికింపు పనులు జరుగుతున్నాయి. కలప గుమ్మాలు, కిటికీలు చెద పడుతున్నందున అన్ని గదులకూ టాటా ఐరన్ గుమ్మాలు, డోర్లు ఏర్పాటు చేస్తున్నారు. అగ్ని ప్రమాదాలకుకు ఆస్కారం లేని మెటీరియల్ వాడుతున్నామని కాకినాడకు చెందిన ఈ సత్రం నిర్మాణ కాంట్రాక్టర్ ధూళిపాళ రాజేష్ చెప్పారు.



వేగంగా సాగుతున్న శివసదన్ సత్రం నిర్మాణం



శివసదన్ సత్రం సూట్ రూమ్

ప్రస్తుతం సత్రం బయటి వైపు రంగులు వేసే పనులు కూడా జరుగుతున్నాయన్నారు. సత్రం గదులకు తలుపులు బిగించడం, పోర్టికో వంటి పనులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సత్రంలోని 138 గదుల్లోనూ రూ.కోటితో ఏసీలు, గీజర్ల ఏర్పాటుకు టెండర్లు ఖరారు చేశారు. వీటిని నెల రోజుల్లో ఏర్పాటు చేయనున్నారు.

ఏప్రిల్‌లో ప్రారంభించేందుకు చర్యలు



శివసదన్ సత్రాన్ని ఏప్రిల్‌లో ప్రారంభించాలని నిర్ణయించాం. అందువలన పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. గదుల కొరత కారణంగా భక్తులకు పూర్తి స్థాయిలో వసతి కల్పించలేకపోతున్నాం. శివసదన్ సత్రం అందుబాటులోకి వస్తే ఆ సమస్య కొంత తీరుతుంది.

- ఎన్‌వీ సత్యనారాయణమూర్తి,
ఈఓ, అన్నవరం దేవస్థానం

చేసిన సేవలే సంతృప్తినిస్తాయి



డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్‌ను సత్కరించిన బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్ సభ్యులు

- డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్
- పద్మశ్రీ పురస్కార గ్రహీతకు సన్మానం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): చేసిన సేవలే జీవితంలో చిరస్థాయిగా నిలిచి, సంతృప్తినిస్తాయని పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్ అన్నారు. డాక్టర్ బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్ ఆధ్వర్యాన లయన్స్‌క్లబ్ హాలులో ఆదివారం ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, దేశంలో 90 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లో విద్య, వైద్యం, తాగునీరు లేక అవస్థలు పడుతున్నారని అన్నారు. తన వంతు సమాజ సేవ చేయాలనే లక్ష్యంతోనే కంటి వైద్యశాల, విద్యాలయం ప్రారంభించానని తెలిపారు. లయన్స్ క్లబ్‌ల ద్వారా ఏదో ఒక రూపంలో సామాజిక సేవ చేయడం శుభపరిణామమని, మహిళలు స్వచ్ఛందంగా క్లబ్ సేవల్లో పాల్గొనడం అభినందించదగ్గ విషయమని అన్నారు. ఐ బ్యాంక్ వ్యవస్థాపకుడు బాలకృష్ణ ఆధ్వర్యంలో చంద్రశేఖర్‌ను సత్కరించారు. ఐ బ్యాంక్ అధ్యక్షుడు డి.శంకరరావు, కార్యదర్శి బాలకృష్ణ, దాసరి సాయికృష్ణ, కె.మురళీకృష్ణ, డి.విజయలక్ష్మి, పైడా సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గలగల పారే గోదారిలా..

- డెల్టాలకు అదనంగా నీరు
- మూడు కాలువలకూ 660 క్యూసెక్కుల పెంపు
- కాటన్ బ్యారేజీ వద్దకు సీలేరు నుంచి అదనపు జలాలు



కూనవరం వద్ద గోదావరిలో కలుస్తున్న సీలేరు జలాలు

సాక్షి, అమలాపురం: గోదారమ్మ గలగలా పారుతోంది.. బీటలు వారుతున్న భూములను సస్యశ్యామలం చేసేందుకు పరుగులు తీస్తోంది.. అదనపు జలాలను అందిపుచ్చుకుని కళకళలాడుతోంది. గోదావరి డెల్టాలో రబీ సాగుకు ఒకవైపు నీటి వినియోగం పెరుగుతోంది. మరోవైపు వేసవి తాపం అధికమవుతోంది. దీనివల్ల సాగునీటికి డిమాండ్ ఏర్పడుతున్న తరుణంలో గోదావరి డెల్టా కాలువలకు జలవనరుల శాఖ అధికారులు నీటి విడుదలను పెంచారు. ఇదే సమయంలో సీలేరు పవర్ జనరేషన్ నుంచి, బైపాస్ పద్ధతిలో విడుదల చేస్తున్న జలాలు ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్దకు వచ్చి చేరడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

గోదావరి డెల్టాలో రబీ సాగు అవసరాలకు అనుగుణంగా ఇరిగేషన్ అధికారులు నీటి విడుదల పెంచారు. తూర్పు, మధ్య డెల్టా కాలువలకు 100 క్యూసెక్కుల చొప్పున, పశ్చిమ డెల్టాకు 460 క్యూసెక్కుల చొప్పున మొత్తం మూడు డెల్టాలకు అదనంగా 660 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ఇప్పటి వరకూ ఈ మూడు డెల్టాలకు 6,895 క్యూసెక్కులు పంపిణీ చేయగా, ఆదివారం నుంచి దీనిని పెంచి 7,555 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తాజాగా పెంచిన నీటితో తూర్పు డెల్టాకు 2,130, మధ్య డెల్టాకు 1,425, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కుల చొప్పున వదులుతున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా తూర్పు, మధ్య డెల్టాల్లోని శివారు, మెరక ప్రాంతాల్లో సాగునీటికి డిమాండ్ ఉన్న నేపథ్యంలో అధికారులు విడుదల పెంచటం రైతులకు ఊరటనిచ్చే అంశం. అయితే మరింత నీటిని విడుదల చేయాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేస్తున్నారు. తూర్పు డెల్టాలో తాళ్లరేవు, మధ్య డెల్టాలో ఉప్పలగుప్తం, కాట్రేనికోన మండల శివారు ప్రాంతాల్లో సాగునీటికి డిమాండ్ ఉంది.

అదనపు జలాలతో కళకళ

సీలేరు పవర్ జనరేషన్ నుంచి, బైపాస్ పద్ధతిలో విడుదల చేస్తున్న అదనపు జలాలు ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్దకు చేరాయి. ప్రస్తుతం బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో 7,219 క్యూసెక్కులు కాగా, దీనిలో సీలేరు వాటా 6,958 క్యూసెక్కులు. మిగిలిన 261 క్యూసెక్కుల నీటిని పోలవరం ప్రాజెక్టు నుంచి సేకరిస్తున్నారు. గత జనవరిలో సీలేరు నుంచి బైపాస్ పద్ధతిలో మూడు వేల క్యూసెక్కుల నీరు సేకరించారు. అయితే విద్యుత్ ఉత్పత్తికి ఇబ్బంది ఏర్పడుతోందని నీటి విడుదలను నిలిపివేశారు. ఇప్పుడు డెల్టాలో రబీకి నీటి ఎద్దడి నెలకొన్న నేపథ్యంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని, మరోసారి అదనపు జలాల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పుడు ఆ నీరు బ్యారేజీ వద్దకు చేరాయి. మరోవైపు రైతుల రబీ సాగుకు భరోసా దక్కినట్టయ్యింది. దీంతో ఎటువంటి ఇబ్బందీ లేకుండా సజావుగా సాగనుంది.

నిరంతరం పర్యవేక్షణ



గోదావరి డెల్టాలో రబీ సాగుకు నీటి సరఫరాపై ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ చేస్తోంది. ఇప్పటికే వంతుల వారీ విధానం ప్రారంభించాం. క్రాస్‌బండ్లు నిర్మించడంతో పాటు మోటార్ల ద్వారా నీటి తోడకానికి డీజిల్ బిల్లులు అందించేందుకు నిధులు మంజూరయ్యాయి. సీలేరు నుంచి అదనపు జలాలు రావడంతో కాలువలకు నీటి విడుదల పెంచాం. రైతుల అవసరాన్ని బట్టి నీటిని అందిస్తాం.

– డి.రామ్‌గోపాల్, ఇరిగేషన్ అధికారి,
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

క్లుప్తంగా

నేడు 'డయల్ యువర్ ఈఓ'

అన్నవరం: అన్నవరం సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో సోమవారం 'డయల్ యువర్ ఈఓ' కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 10-30 నుంచి 11-30 వరకూ భక్తులు 08868-238127 నంబర్‌కు ఫోన్ చేసి దేవస్థానం ఈఓ సత్యనారాయణ మూర్తితో మాట్లాడొచ్చు. తమ విలువైన సలహాలు, సూచనలతో పాటు ఫిర్యాదులు తెలియజేయవచ్చు.

ముగిసిన చదరంగం పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ): స్థానిక జిల్లా క్రీడా మైదానంలో కాకినాడ చదరంగం సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-13 చదరంగ పోటీలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. బాలుర విభాగంలో సూరాడ యషశ్వి సత్యగంగాధర్, సాయి శ్రీనివాస్ ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందారు. బాలికల విభాగంలో నూక లాస్య, శ్రీకర దుర్గప్రణవి బంగారు, వెండి పతకాలు సాధించారు. విజేతలకు జిల్లా క్రీడా మైదానం చీఫ్ కోచ్ శ్రీనివాస్‌కుమార్ బహుమతులు అందజేశారు.

బైక్‌లు ఢీ: ఇద్దరికి గాయాలు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని పోలేకుర్రు వై.జంక్షన్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, కోరంగి పోలీసుల కథనం ప్రకారం.. వై.జంక్షన్ వద్ద ఉన్న పూల దుకాణం సమీపంలో ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కోరంగి పంచాయతీ చినబొడ్డు వెంకటాయపాలేనికి చెందిన కర్రి మధు, గాడిమొగ పంచాయతీ లక్ష్మీపతిపురం గ్రామానికి చెందిన తేలు చినఅర్జయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని హుటాహుటిన 108 అంబులెన్స్‌లో తాళ్లరేవు సామాజిక ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాకినాడకు చెందిన యువకులు యానాం వెళ్లి మద్యం తాగి బైక్‌పై తిరిగి వేగంగా వచ్చి ఢీకొన్నట్లు స్థానికులు అంటున్నారు. కోరంగి పోలీసులు కేసు నమోదు చేశారు.

నిందితుల పరారీపై విచారణకు ఆదేశం

కాకినాడ క్రైం: దుకాణాల్లో చోరీలకు పాల్పడుతున్న నిందితులు గొల్లప్రోలు పీఎస్ నుంచి పారిపోయిన ఘటనపై ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు విచారణకు ఆదేశించారు. కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డిని విచారణ అధికారిగా నియమించారు. ఆ వివరాల్లోకి వెళితే.. శుక్రవారం చోరీ కేసులో ముగ్గురు బాలనేరస్తులు పట్టుబడ్డారు. వారిని గొల్లప్రోలు పీఎస్‌కు తరలించగా శుక్రవారం అర్ధరాత్రి అక్కడి నుంచి పరారయ్యారు. ఆ ముగ్గురే ఉప్పాడ- కొత్తపల్లి మండలం కొండెవరంలో ఓ చోరీ చేస్తూ అక్కడ పోలీసులకు పట్టుబడ్డారు. నేరస్తుల పరారీ ఘటనపై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. ఓ ఏఎస్‌ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు, ఇద్దరు హోంగార్డులను జిల్లా కార్యాలయానికి వచ్చి రిపోర్టు చేయాలని ఎస్పీ ఆదేశించారు.

అమ్మా... బై బై

- ఇంట్లో చెప్పి పరీక్షకు వెళ్లిన ఇద్దరు విద్యార్థుల మృతి
- లారీ ఢీకొనడంతో ఘటన
- మరొకరికి స్వల్ప గాయాలు
- రెండు కుటుంబాల్లో విషాదం

అయినవిల్లి: కన్నా.. పరీక్ష బాగా రాయ్.. తొందర పడకుండా జాగ్రత్తగా వెళ్లి రా నాన్నా.. అంటూ తల్లి సాగనంపగా...! అలాగే అమ్మా బై వెళ్లి వస్తా... అంటూ ఇంటి నుంచి పరీక్ష రాసేందుకు బయలు దేరిన ఇద్దరు విద్యార్థులు కొద్ది నిమిషాల్లోనే అనుకోని ప్రమాదంలో అనంత లోకాలకు వెళ్లిపోయారు.. అయినవారికి గుండె కోతను మిగిల్చారు.. ఈ హృదయ విదారక ఘటన అయినవిల్లి మండలంలో చోటుచేసుకుంది. బైక్‌పై ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు వెళ్తుండగా లారీ ఢీకొనడంతో ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అయినవిల్లి ఎస్సై ఎస్.నాగేశ్వరరావు కథనం ప్రకారం.. అంబాజీపేట మండలం ముక్కామల నందెపుపాలేనికి చెందిన నందెపు రాజేష్ (17), కొత్తపేట మండలం ఖండ్రిగ శివారు అల్లపల్లివారిపాలేనికి చెందిన అల్లపల్లి నాగేంద్ర (17), రాకుర్తివారిపాలేనికి చెందిన కోటిపల్లి మోహనవీరవెంకట సాయికృష్ణ(18)లు స్నేహితులు. ఈ ముగ్గురూ అమలాపురంలోని శ్రీచైతన్య కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఇంటర్ చదువుతున్నారు. ఆదివారం సైన్స్ ప్రాక్టికల్ పరీక్ష ఉండడంతో ముగ్గురూ ఒకే బైక్‌పై అమలాపురానికి బయలు దేరారు. ఈ నేపథ్యంలో అయినవిల్లి మండలం నేదునూరు పెదపాలెం పంచాయతీ శివారు టి.సావరంలో జమ్మిచెట్టు వద్దకు వచ్చేసరికి అమలాపురం వైపు వెళ్తున్న వీరి మోటార్ సైకిల్‌ను ఎదురుగా వేగంగా వచ్చిన లారీ ఢీకొంది. ఈ ఘటనలో నందెపు రాజేష్, అల్లపల్లి నాగేంద్ర అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. కోటిపల్లి మోహన వీరవెంకట సాయికృష్ణ స్వల్ప గాయాలు కావడంతో అక్కడే ఉన్న ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందించారు. మోటార్ సైకిల్ నుజ్జునుజ్జు అయ్యింది. అమలాపురం రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్సై ఎస్.నాగేశ్వరరావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వీఆర్వో జి.వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన లారీని అయినవిల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ పరారీలో ఉన్నాడు. మృతదేహాలకు పంచనామా నిర్వహించి అనంతరం అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

స్తోమత లేకపోయినా..

కొత్తపేట: ఖండ్రిగ శివారు అల్లపల్లివారిపాలేనికి చెందిన అల్లపల్లి నారాయణరావు, అనంతలక్ష్మిలు దంపతులు. వీరికి ఒక కుమార్తె సాయిదుర్గ, కుమారుడు నాగేంద్ర ఉన్నారు. మధ్య తరగతి కుటుంబానికి చెందిన నారాయణరావు ఖండ్రిగ రేవులో చిన్న కిరాణా షాపు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఇద్దరు పిల్లలూ పదో తరగతి వరకూ సమీపంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివి ఉత్తమ ఫలితాలు సాధించారు. తనకు ఆర్థిక స్తోమత లేకపోయినా నాగేంద్ర కోరిక మేరకు ఇంటర్‌లో ప్రైవేట్ విద్యా సంస్థలో నారాయణరావు చేర్పించారు. గ్రామంలో అందరితో కలివిడిగా ఉండే నాగేంద్ర మృతి ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ప్రాక్టికల్స్ ఉండడం, ఆదివారం కాలేజీ బస్సు రాకపోవడంతో నాగేంద్ర అతని స్నేహితుడి బైక్ తీసుకుని మిగతా ఇద్దరితో కలసి బయలుదేరాడు. ఇలా తమకు దూరమయ్యాడంటూ ఆ తల్లిదండ్రులు, బంధువులు, రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

కాలేజీ బస్సు రాకపోవడంతో..

నందెపు రాజేష్, అల్లపల్లి నాగేంద్ర, కోటిపల్లి మోహన వీరవెంకట సాయికృష్ణలుఇంటి నుంచి కళాశాల బస్సులోనే రోజూ వెళ్లి వచ్చేవారు. ఆదివారం సెలవు కావడంతో బస్సు రాదని, సొంత ట్రాన్స్‌పోర్ట్‌పై ప్రాక్టికల్స్‌కు హాజరు కావాలని కాలేజీ యాజమాన్యం చెప్పడంతో బైక్‌పై వెళ్లాల్సి వచ్చిందని బాధిత కుటుంబ సభ్యులు చెప్పారు. ఆ విధంగా అల్లపల్లి నాగేంద్ర తన స్నేహితుడి బైక్ తీసుకుని బయలుదేరి రాకుర్తివారిపాలెంలో కోటిపల్లి సాయికృష్ణను ఎక్కించుకున్నాడు. ముక్కామల వెళ్లేసరికి అక్కడ రాజేష్ లిఫ్ట్ అడగటంతో అక్కడి నుంచి ముగ్గురూ బయలు దేరారు. నేదునూరు పెదపాలెం వెళ్లేసరికి ఈ ప్రమాదం జరిగింది.



ఘటనా స్థలంలో నందెపు రాజేష్, అల్లపల్లి నాగేంద్ర మృతదేహాలు


ఖండ్రిగ శివారు అల్లపల్లివారిపాలెంలో రోదిస్తున్న నాగేంద్ర కుటుంబ సభ్యులు

వెనుక కూర్చోవడంతో..

మోడేకుర్రు శివారు రాకుర్తివారిపాలేనికి చెందిన సాయికృష్ణ అదృష్టవశాత్తూ ప్రమాదం నుంచి స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. బైక్‌పై వెనుక కూర్చోవడంతో ప్రమాదం తప్పిందని అతని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. సాయికృష్ణ తండ్రి శ్రీను కొత్తపేట సిటీ కేబుల్ నెట్‌వర్క్‌లో పనిచేస్తున్నారు. ఈ ప్రమాదం నుంచి తన కుమారుడు బయట పడటంతో ఊపిరి పీల్చుకున్నారు. నాగేంద్ర, రాజేష్ మృతి దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇల్లు మారినా.. రాత మారలే..

అంబాజీపేట: వాస్తు బాగోలేదని.. ఇల్లు మారినా ఆ కుటుంబం రాత మారలేదు. నందెపు రాజేష్ మృతి ఘటన మరింత కోలుకోలేని విషాదం నింపింది. మృతుడి తల్లిదండ్రులు నందెపు శేషాద్రి ఏసుబాబు, కనకదుర్గ. ఏసుబాబు ఇంటింటికీ తిరిగి పాత సామగ్రి కొని విక్రయించే వ్యాపారం చేస్తున్నారు. సోదరి రమాదేవి బీటెక్ చదువుతోంది. వీరంతా మాచవరం శివారు నందెపువారిపాలెంలో నివాసముండేవారు. అక్కడ గృహ వాస్తు బాగోలేదని, ఆర్థిక పరిస్థితి సక్రమంగా ఉండటం లేదని భావించి.. నెల రోజుల కిందటే ముక్కామలకు వచ్చి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. వీరిది పేద కుటుంబం కావడంతో రాజేష్ ఖాళీగా ఉండే సమయంలో అంబాజీపేటలోని ఓ మెడికల్ షాపులో పనిచేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉండేవాడు. ఆదివారం ప్రాక్టికల్ పరీక్షలకు వెళ్లి వస్తా అమ్మా అని కనకదుర్గకు చెప్పి రాజేష్ బయలు దేరాడు. ఇది జరిగిన కొద్ది నిమిషాలకే అతని మృతి విషయం తెలియడంతో ఆ కుటుంబం శోక సంద్రంలో మునిగిపోయింది. కుమారుడు చేతికి అందివస్తున్న తరుణంలో విధి ఆడిన నాటకంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు, వారి బంధువులు కన్నీరు మున్నీరవుతున్నారు. మృతుల కుటుంబాలను పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పరామర్శించి ఓదార్చారు.


ముక్కామలలో రోదిస్తున్న రాజేష్ తల్లిదండ్రులు, బంధువులు

జాతీయ హాకీ చాంపియన్ మధ్యప్రదేశ్



జాతీయ హాకీ మహిళల సీనియర్ చాంపియన్‌గా నిలిచిన మధ్యప్రదేశ్ జట్టుతో ముఖ్య అతిథులు

ద్వితీయ స్థానంలో మహారాష్ట్ర

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ మహిళల సీనియర్ హాకీ చాంపియన్ షిప్‌ను మధ్యప్రదేశ్ జట్టు కైవసం చేసుకుంది. ఆదివారం మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ జట్ల మధ్య ఫైనల్ జరిగింది. ఇందులో మధ్యప్రదేశ్ 5-1 స్కోర్ తేడాతో విజయం సాధించి చాంపియన్‌గా నిలిచింది. ద్వితీయ స్థానంలో మహారాష్ట్ర, తృతీయ స్థానంలో జార్ఖండ్ జట్లు నిలిచాయి. పోటీల ముగింపు ఉత్సవానికి హాకీ ఇండియా కార్యదర్శి బోలానాథ్ సింగ్, జేఎన్టీయూకే వీసీ ప్రసాదరాజు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా బోలానాథ్ సింగ్ మాట్లాడుతూ జాతీయస్థాయి సీనియర్ మహిళా హాకీ పోటీలను హాకీ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి హర్షవర్ధన్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారన్నారు. క్రీడాకారులకు ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా టెక్నికల్ సిబ్బంది, అంపైర్లు చక్కగా వ్యవహరించారన్నారు. గత ఏడాది జూనియర్స్ విభాగంలో నిర్వహించినప్పుడు కాకినాడకు వచ్చానని అన్నారు. లైవ్‌లో దేశం మొత్తం ఈ టోర్నీని తిలకించిందన్నారు. అనంతరం విజేతలను అభినందించారు. మధ్యప్రదేశ్‌కు బోలానాథ్ సింగ్, మహారాష్ట్రకు హాకీ ఇండియా ట్రెజరర్ శేఖర్, జార్ఖండ్‌కు జేఎన్టీయూకే వీసీ ప్రసాదరాజు ట్రోఫీలను అందించారు. మెడల్స్‌ను నిరంజన్ రెడ్డి, ట్రిపుల్ ఒలింపియన్ ముఖేష్‌కుమార్, డబుల్ ఒలింపియన్ సత్యగీత బంగారు, వెండి, రజత పతకాలు ఇచ్చారు. బెస్ట్ గోల్ కీపర్‌గా సోనల్‌మిన్, బెస్ట్ డిఫెండర్‌గా ప్రతిభ ఆర్య, బెస్ట్ పార్‌వార్డ్ అవార్డును అబ్సెలరాణి పొందారు. కార్యక్రమంలో హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు చాణక్యరాజ్, కార్యదర్శి హర్షవర్ధన్‌రెడ్డి, కోశాధికారి థామస్ పీటర్, టోర్నీ కోఆర్డినేటర్ వి.రవిరాజు, డీఎస్‌ఏ చీఫ్ కోచ్ శ్రీనివాస్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ మహిళా జట్టు మేనేజర్ నాగమణి, బాబ్జి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..


రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వీరలక్ష్మి, వీరహంస


అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్, ఎమ్మెల్యే వెంకట్రావు

బైక్‌ను ఢీకొన్న వ్యాన్

- ఒకరి మృతి
- ఇద్దరికి తీవ్ర గాయాలు

దేవరపల్లి: గుండుగొలను- కొవ్వూరు జాతీయ రహదారిపై దేవరపల్లి మండలం కృష్ణంపాలెం వద్ద ఆదివారం ఘోర ప్రమాదం జరిగింది. ఇందులో చిన్నాయగూడేనికి చెందిన నీలపాటి శ్రీహరి (40) అక్కడికక్కడే మృతి చెందగా, వీరలక్ష్మి, వీరహంస తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. చిన్నాయగూడేనికి చెందిన నీలపాటి శ్రీహరి, వీరలక్ష్మి, వీరహంస బైక్‌పై దేవరపల్లి వైపు వెళుతుండగా, ఎదురుగా వ్యాన్ వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీహరి అక్కడికక్కడే మృతి చెందగా, బైక్‌పై వెనుక కూర్చున్న వీరలక్ష్మి, వీరహంస తీవ్రంగా గాయపడ్డారు. అపస్మారక స్థితిలో ఉన్న క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కె.శ్రీహరిరావు తెలిపారు. ఇదిలా ఉంటే ప్రమాదం జరిగిన సమయంలో నల్లజర్ల వెళుతున్న రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావులు అక్కడ ఆగి పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను ఎస్సై శ్రీహరిరావును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ కృష్ణంపాలెం -యర్నగూడెం మధ్య హైవేపై ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని ఎంపీకి వివరించారు. మూడు రోజుల కిందట రోడ్డు ప్రమాదం జరిగి ఒకరు మృతి చెందారన్నారు. కృష్ణంపాలెం నుంచి యర్నగూడెం వరకు సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేసి, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. దీనిపై ఎంపీ భరత్‌రామ్ సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, ప్రజలకు అవగాహన సదస్సులు, రోడ్డుపై హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

ప్రమాదంలో యువకుడి మృతి


పళ్ల బాబి (ఫైల్)

అమలాపురం టౌన్: స్థానిక వై.జంక్షన్ వద్ద 216 జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. అంబాజీపేటకు చెందిన పళ్ల బాబి (17) అల్లవరంలో తన అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ తాపీ పని చేస్తున్నాడు. అమలాపురం నుంచి తన మోటారు సైకిల్‌పై వెళుతున్న బాబీని తాటిపాక వైపు నుంచి వస్తున్న ఇన్నోవా కారు బలంగా ఢీకొంది. వెంటనే అతన్ని స్థానికులు స్థానిక కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషయంగా ఉండడంతో రాత్రి 11.30 గంటలకు కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున మృతి చెందాడు. చేతికి అందివస్తున్న కొడుకు కన్నుమూయడంతో అంబాజీపేటలో ఓ హోటల్‌లో పనిచేస్తున్న బాబి తండ్రి నరసింహారావు, అతని కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. పట్టణ ఎస్సై జి.హరీష్‌కుమార్ కేసు నమోదు చేశారు.

వ్యక్తి ఆత్మహత్య


రైలు పట్టాలపై లభించిన మృతదేహం

సామర్లకోట: జి.మేడపాడు రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే సూపరింటెండెంట్ కె.సీతారామస్వామి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఆదివారం రైల్వే ఇన్‌చార్జి ఎస్సై ఎస్.రవికుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. రైలు పట్టాలపై తల పెట్టడంతో తల, మొండెం వేరు అయ్యాయని ఆయన తెలిపారు. పసుపుపై నల్ల గళ్ల ఫుల్ హ్యాండ్ షర్టు, నీలం రంగు జీన్ ఫ్యాంటు ధరించి ఉన్నాడని అన్నారు. మృతుడి కుడి చేతిపై పార్వతి పేరు, ఎడమ చెయ్యి షోల్డర్ దిగువన సాజీ అనే పచ్చ బొట్లు ఉన్నాయని వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు రవికుమార్ వివరించారు. మరిన్ని వివరాలకు 94407 02328కు ఫోన్ చేయాలన్నారు.

వీడని మిస్టరీ..

రాయవరం: మండలంలోని మాచవరం- పసలపూడి గ్రామాల మధ్య పూర్తిగా కాలిన స్థితిలో లభ్యమైన మహిళ మృతదేహం మిస్టరీ వీడలేదు. ఈ నెల 24న మండపేట- కాకినాడ రహదారి పక్కన మాచవరం- పలసపూడి గ్రామాల మధ్య మహిళ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఇది జరిగి మూడు రోజులు అయినా మృతి చెందిన మహిళకు సంబంధించిన వారెవ్వరూ ముందుకు రాలేదు. ఆ మహిళ ఎవరనేది ఇంకా అంతు చిక్కడం లేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో మహిళ మిస్సింగ్ కేసుల సమాచారాన్ని పోలీసులు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఆమె ఎవరనే విషయం తెలిస్తే హత్యకు సంబంధించిన కారణాలు పోలీసులు ఛేదించే అవకాశం ఉంటుంది. రామచంద్రపురం డీఎస్పీ డి.బాలచంద్రారెడ్డి నేతృత్వంలో మండపేట రూరల్ సీఐ శివగణేష్ దర్యాప్తు ముమ్మరం చేశారు.

పురుగు మందు తాగి యువకుడి ఆత్మహత్య

చాగల్లు: పురుగు మందు తాగి మండలంలోని మల్లవరానికి చెందిన మల్లిపూడి సత్తిపండు (30)అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి. మద్యానికి బానిసైన సత్తిపండు అనారోగ్యం పాలయ్యాడు. కూలి పనులకు కూడా వెళ్లలేని స్థితిలోకి చేరుకున్నాడు. దాంతో అతడి భార్య కృష్ణవేణి పుట్టింటికి వెళ్లింది.

దాంతో సత్తిపండు మనస్థాపానికి గురై శనివారం రాత్రి పురుగు మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉండగా అతడిని చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్టు ఏఎస్సై హుస్సేన్ తెలిపారు. మృతుడి భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు. సత్తిపండుకు ముగ్గురు పిల్లలు ఉన్నారు.


మృతుడు మల్లిపూడి సత్తిపండు

పాడి-పంట

కొబ్బరి.. యాజమాన్యం తప్పనిసరి

- వేసవిలో జాగ్రత్తలు అవసరం
- తద్వారా అధిక దిగుబడులు

అంబాజీపేట: ఎండా కాలం.. మండే కాలం. ఇది ప్రజలన్నే కాదు పంటలనూ ఇబ్బంది పెడుతోంది. ఈ కాలంలో ఎక్కువగా కొబ్బరి చెట్లకు నష్టం జరిగే అవకాశం ఉంటోంది. మార్చి నుంచి జూలై వరకూ ఈ తోటలకు నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి. లేకుంటే దిగుబడులు తగ్గే అవకాశాలు ఉంటాయని అంబాజీపేట ఉద్యాన విశ్వవిద్యాలయం, ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వేసవిలో సగటున కాపు కాసే చెట్టుకు రోజుకు సుమారు 50 నుంచి 60 లీటర్ల వరకూ సాగునీరు అవసరమవుతుంది. నీటి ఎద్దడి గురైన కొబ్బరి తోటలలో చెట్టు బలం క్షీణించే కొద్దీ పురుగులను తట్టుకునే శక్తి తగ్గిపోతుంది. ఈ సమయంలో చెట్టుపై ఎర్రముక్కు పురుగు, మొవ్వులో కొమ్ము పురుగు ఆశించే అవకాశముందని శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల్లో సుమారు 90 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగు అవుతోంది. ఇక్కడి రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని అధికారులు వివరిస్తున్నారు.

నీటి ఎద్దడికి గురైతే..

నీటి ఎద్దడికి గురైతే ముదురు కొబ్బరి చెట్ల ఆకులు వడిలిపోయి, వంగి ఉంటాయి. పూత కొద్దిగా రావడం, పిందె ఎక్కువగా రాలిపోవడం జరుగుతుంది. పొత్తులలో ఆడ పువ్వులు తక్కువగా ఉండి దిగుబడి మందగిస్తుంది. కాయలు తయారు కాకుండా నీటి కాయ (బొండం) పరువంలోనే వాలి దిగుబడి బాగా దెబ్బతింటుంది.


కొబ్బరి చెట్టు మొదలులో డొక్కలు పెట్టే విధానం

వేడిగాలులు సోకే వేసవిలో పూల ఫలదీకరణ తగ్గి, పిందె కట్టడం బాగా తగ్గుతుంది. కొబ్బరి దిగుబడి, కాయ సైజు, కొబ్బరి నాణ్యతపై ప్రభావం పడుతోంది. నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్న సమయాలలో చెట్టు చనిపోయే ప్రమాదం ఉంది.

ఇవి పాటిస్తే మంచిది

ఉష్ణోగ్రతలు, వేడి గాలులు, భూమి స్వభావాన్ని బట్టి తేమ ఆరకుండా కొబ్బరి చెట్లకు నీరు సక్రమంగా అందించాలి. వేసవిలో తేలికపాటి భూములలో 5 నుంచి 7 రోజుల వ్యవధిలో నీటి తడులను పెట్టాలి. చెట్టు చుట్టూ పళ్లెం చేసి బేసిన్ పద్ధతి ద్వారా కాని, డ్రిప్ పద్ధతి ద్వారా కాని నీటిని అందించాలి. చెట్టు నుంచి 2 మీటర్ల దూరంలో రెండు మీటర్ల లోతు, వెడల్పులో గాడి తవ్వాలి. అందులో కొబ్బరి డొక్కలు అంచులు పైకి ఉండేటట్టు వరుసలుగా పరిచి మట్టి కప్పాలి. ఎండిన ఆకులు ముక్కలుగా నరికి చెట్టు చుట్టూ పళ్లెంలో వేయడం వల్ల నేల వేడి తగ్గి, నీటి ఆవిరి తగ్గించి తడిగా ఉంచుతుంది.

జాగ్రత్తలు తీసుకోవాలి



ఫిబ్రవరి నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. వేసవి కాలంలో కొబ్బరి తోటల్లో జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయి. పురుగులు తగ్గుముఖం పడతాయి. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలలో పురుగులు, తెగుళ్లు ఎక్కువగా ఆశించొచ్చు. శాస్త్రవేత్తలు సూచించిన నివారణ చర్యలు చేపట్టడం ద్వారా చెట్లు ఆరోగ్యంగా ఉంటాయి. అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రంలో కొబ్బరిలో సంకరీకరణపై శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహిస్తాం. కొబ్బరి అభివృద్ధి బోర్డు సాయంతో ఈ శిక్షణ ఇస్తున్నాం.

–డాక్టర్ బి.శ్రీనివాసులు, ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి, అంబాజీపేట